విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థు లకు మెరుగైన వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంక్షేమ వసతి గృహాల అత్యవసర మరమ్మతులపై ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. సంక్షేమ వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థులకు చదువుతోపాటు, మెరుగైన వసతి కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 46 ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు నిర్వహిస్తుండగా, వీటిలో 35 వసతి గృహాలు ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఎస్సీ 25, బిసి 09, ఎస్టి 01 వసతి గృహాల్లో ఉన్నాయని, వీటిలో మరమ్మతులను చేపట్టుటకు సుమారు రూ.2.65 కోట్ల అంచనాలతో గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదన తయారు చేసి సమర్పించినట్టు తెలిపారు. ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించి తాడేపల్లిగూడెం పరిమళ, తణుకు బాలికలు, పాలకొల్లు ఆనంద నిలయం, పెంటపాడు బాయ్స్ అండ్ గర్ల్స్ వసతి గృహాలలు, బీసీ వెల్ఫేర్‌కు సంబంధించి కాళీపట్నం, పాతపాడు వసతి గృహాలు, ఎస్టి వెల్ఫేర్‌కు సంబంధించి భీమవరం వసతిగృహం మరమ్మతులను అత్యవసరంగా చేపట్టాల్సిఉందని సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా గృహనిర్మాణ శాఖ ఈఈ జి.పిచ్చయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి వి ఆర్ కె ఎస్ ఎస్ గణపతి రావు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎస్.సత్య నారాయణ, సోషల్ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యుఓ భానుమణి, ట్రైబల్ వెల్ఫేర్ హెచ్.డబ్ల్యు.ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

విశాలాంధ్ర- నూజివీడు : జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సాధించినట్లు ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. గురువారం ఆయన నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితులపై అవగాహన కల్పించుకోవడానికి పర్యటిస్తూ తన పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరును పరిశీలించి ప్రజలకు మరింత సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. నేటి ఆధునిక యుగంలో ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ వాడకం సమస్యగా మారిందని అదే సమస్య మనదేశంలోనూ మొదలైందని ఈ పరిస్థితుల్లో ఏలూరు జిల్లాలో గంజాయి నివారణకు ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కోడిపందాలు, పేకాట వంటి జూద కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి నూజివీడు వచ్చిన ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌ను నూజివీడు డిఎస్పీ లక్ష్మయ్య ఇతర పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలుతో ఆహ్వానించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర -ఏలూరు: ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్., ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు డివిజన్ పరిధిలోని ఏలూరు రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో (బాలయోగి సైన్సు పార్కు, అశోక్ నగర్ సబ్ స్టేషన్ వద్ద) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందవలసినదిగా కోరారు. ఈ సమావేశమునకు కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రేస్సల్ ఫోరమ్ చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి. జనార్ధన రావు, ఆర్థిక సభ్యులు యమ్. శ్రీనివాస్, స్వతంత్ర్య సభ్యులు డా. ఆర్.సురేంద్ర కుమార్ హాజరవుతారని కార్యదర్శి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రేస్సల్ ఫోరమ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఏ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ మార్గ్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. ఇండియా. బ్రాంచ్ చిరునామా:డి.నం.6-3-13, 1వ అంతస్తు, సౌత్ ఇండియన్ బ్యాంక్ పైన, చల్లపల్లివారి వీధి, టి-నగర్, రాజమహేంద్రవరం (రాజమండ్రి), ఆంధ్రప్రదేశ్.

ప్రైవేటు ఒప్పందం కింద స్థిర ఆస్తి అమ్మకానికి నోటీసు

హామీగా పెట్టిన రుణాలను తిరిగి రాబట్టుట కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("నియమాలు") కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకున్న స్థిర ఆస్తులను ప్రైవేటు ఒప్పందం ద్వారా విక్రయించేందుకు విక్రయ నోటీసు. అయితే దిగువ సంతకందారైన కింద సంతకం చేసిన వ్యక్తి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా సర్ఫేశీ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 సెక్షన్ 13(2) నిబంధన 9 కింద సంక్రమించిన అధికారులను వినియోగించి నోటీసు పేర్కొన్నట్లుగా పూర్తి రుణ మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలందరూ నిర్దేశిత గడువులోగా రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి క్రింద పేర్కొన్న స్థిర ఆస్తిని భౌతికంగా స్వాధీనం చేసుకోవడమైనది. మరియు పేర్కొన్న హామీగా పెట్టిన స్థిరఆస్తిని నిబంధనలలోని రూల్ 9తో చదివే రూల్ 8(5)లో పేర్కొన్న పద్ధతులను అవలంభించడం ద్వారా విక్రయించడం ప్రారంభించినారు. వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, హామీగా పెట్టిన ఆస్తిని విక్రయించడానికి ఇప్పటికే వేలం నిర్వహించినప్పటికీ విఫలమైనారు. ఇప్పుడు కింద పట్టికలో పేర్కొన్నవిధంగా రిజర్వు ధరకు హామీగా పెట్టిన ఆస్తిని కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న కొనుగోలుదారు(ల) నుండి అధీకృత అధికారి ఆఫర్‌ను అందుకున్నారు. అందుచేత కింద పేర్కొన్న రుణ ఖాతాలోని మొత్తం బకాయిలను ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి పదిహేను (15) రోజులలోపు చెల్లించని యెడల బకాయిలు రాబట్టుకునేందుకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్స్ 8&9తో చదివే సర్ఫేశీ చట్టం యొక్క నిబంధనలకు లోబడి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అనుకూలంగా తనఖా పెట్టబడిన క్రింద పేర్కొన్న హామీగా పెట్టిన ఆస్తి తేదీ: 10-08-2024న "ప్రైవేటు ఒప్పందం" ద్వారా "ఎచ్చట ఉన్నది ఉన్నట్లు" మరియు "ఏముంటే అది ప్రాతిపదిక" పై "ఎక్కడ ఉందో అలాగే" ప్రాతిపదికపై విక్రయించబడునని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు)కు నోటీసు ఇవ్వడమైనది.

వ. సం.	లోన్ ఎ/సి. నం. & బ్రాంచ్	రుణగ్రహీత(లు), సహ రుణగ్రహీత(లు), చట్టబద్ధ వారసు(లు)/న్యాయ ప్రతినిధి/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం & డిమాండ్ నోటీసు తేదీ	రిజర్వు ధర	ధరావత్తు సొమ్ము	స్థిర ఆస్తి యొక్క వివరాలు
1	HI0000000 019696	మహేశ్వరరావు (రుణగ్రహీత), లావణ్య మేడమ్ (సహ-రుణగ్రహీత)	05-10-2022 నాటికి రూ.831612/- .... తేదీ:18-10-2022	రూ.700000/- (ఏడు లక్షల రూపాయలు మాత్రమే)	రూ.70000/- (డెబ్బై వేల రూపాయలు మాత్రమే)	డి.నం.1-6 (పాత డోర్ నం.1-8), ఆర్.ఎస్.నం.342, సోమరాయనం పేట గ్రామం, కిర్లంపూడి మండలం, రామాలయం, కిర్లంపూడి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్-533431

హామీగా పెట్టిన ఆస్తులను విడిపించుకోవడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా పైన ప్రస్తావించిన రుణగ్రహీతలను కోరడమైనది.

ప్రైవేట్ ఒప్పందం ద్వారా ఆస్తి విక్రయానికి సంబంధించిన నిబంధనలు & షరతులు క్రింది విధంగా ఉన్నాయి:

1. విక్రయం కచ్చితంగా సర్ఫేశీ చట్టం/నిబంధనల్లోని నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడును. విక్రయం "ఎచ్చట ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదిక" మరియు "ఏముంటే అది ప్రాతిపదిక" పై ప్రైవేట్ ఒప్పందం ప్రకారం నిర్వహించబడును.
2. కొనుగోలుదారు ఆస్తి కొనుగోలు కోసం ఆఫర్‌ను వీహెచ్‌ఎఫ్‌సిఎల్ స్వీకరించిన తర్వాతి పని రోజున విక్రయ పరిశీలన ధరావత్తు సొమ్మును డిపాజిట్ చేయాలి. మరియు మిగిలిన మొత్తం ఆ తర్వాత 15 రోజులలోపు చెల్లించవలెను.
3. కొనుగోలుదారు ఆఫర్ చేసిన మొత్తంలో 10% దరఖాస్తుతో పాటుగా జమ చేయాలి. పై క్లాజు (2) ప్రకారం అది అప్పటికే చెల్లించిన ధరావత్తు సొమ్ము డిపాజిట్‌తో సర్దుబాటు చేయబడుతుంది.
4. పైన పేర్కొన్న నిబంధన (2) ప్రకారం అవసరమైన మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనట్లయితే దరఖాస్తుతో పాటు చెల్లించిన 10శాతంతో సహా అప్పటికే చెల్లించిన మొత్తం జప్తు చేయబడుతుంది.
5. వీహెచ్‌ఎఫ్‌సిఎల్ కొనుగోలు ప్రతిపాదనను అంగీకరించనట్లయితే, అప్లికేషన్‌తో పాటు చెల్లించిన 10% మొత్తం ఎటువంటి వడ్డీ లేకుండానే తిరిగి చెల్లించబడుతుంది.
6. వీహెచ్‌ఎఫ్‌సిఎల్‌కి తెలిసిన లేదా తెలియకపోయినా ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో ఉండే అన్ని భారాలతో ఆస్తి విక్రయించబడుతోంది. థర్డ్-పార్టీ క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలకు అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్ ఏ విధంగానూ బాధ్యత వహించరు.
7. కొనుగోలుదారు ఆస్తి (ప్రైవేట్ ఒడంబడిక ద్వారా జరుగుతున్న విక్రయానికి సంబంధించి) కి సంబంధించిన అన్ని అంశాలపై సంతృప్తి చెందేవిధంగా తగిన శ్రద్ధ వహించాలి.ఈ విషయంలో అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్‌పై తదుపరి తేదీలో ఎలాంటి దావా వేయడానికి కొనుగోలుదారు అర్హులు కాదు.
8. ఎటువంటి కారణం చెప్పకుండానే ఏదైనా కొనుగోలు ప్రతిపాదనను తిరస్కరించే హక్కు వీహెచ్‌ఎఫ్‌సిఎల్ కలిగి ఉంది.
9. ఒకటి కంటే ఎక్కువ ఆఫర్ల విషయంలో, అత్యధిక బిడ్డర్ మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయడంలో విఫలమైతే, వీహెచ్‌ఎఫ్‌సిఎల్ రెండవ అత్యధిక ఆఫర్‌ను అంగీకరించవచ్చు.
10. ఆసక్తిగల కొనుగోలుదారులు అధీకృత అధికారిని సంప్రదించవచ్చు: వేమూరి చంద్ర మౌళీశ్వర శర్మ / పీలపల్లి రాజు రెడ్డి, మొబైల్ నంబర్: 9396346118/ 9949600034 సోమవారం నుండి శనివారం వరకు పని గంటలలో (ఉదయం 10 నుండి సాయంత్రం 6 వరకు)
11. కొనుగోలుదారు వర్తించే టీడీఎస్, స్టాంప్ డ్యూటీలు/అదనపు స్టాంప్ డ్యూటీ/ట్రాన్స్‌ఫర్ ఛార్జీలు మొదలైనవాటిని మరియు అన్ని చట్టబద్ధమైన/చట్ట బద్ధం కాని బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు మొదలైనవి ఏవైనా భరించవలెను.
12. ఆఫర్ అందుకోవడానికి చివరి తేదీ 09-08-2024 సాయంత్రం 05.00 గంటలలోపు. ఆఫర్‌లను బ్రాంచ్ ఆఫీస్‌లో సమర్పించవచ్చు.

తేదీ : 26.07.2024 | సం/-అధీకృత అధికారి
ప్రదేశము : గోదావరి | వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

విద్యార్థి పైశాచికం

- మైనర్ బాలుడిపై తోటి విద్యార్థి కర్కశం
- హాస్టల్ నుండి వెళ్లిపోయేందుకు విద్యార్థిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : వారిరువురూ మైనర్ బాలురు. ఎటువంటి అపోహలకు తావు లేకుండా ఆనందంతో చదువుకోవాల్సిన వయసులో ఒక బాలుడి మనసులో కరుడుగట్టిన ఆలోచనలకు బీజం పడింది. తాను ఎలాగైనా ఇంటికి వెళ్లిపోవాలన్న ఉద్దేశంతో మరొక మైనర్ బాలుడిపై తన కర్కశత్వాన్ని చూపించాడు. ఎటువంటి కనికరం లేకుండా తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను సహచర విద్యార్థి శరీరంపై పోసి నిప్పంటించాడు. ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు పాఠశాల యాజమాన్యం అన్ని విధాల ప్రయత్నించి విఫలం అవ్వడంతో విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏలూరు నగరంలోని సెయింట్ జేవియర్ పాఠశాల ఆవరణలోని హాస్టల్లో చోటు చేసుకున్న ఈ పైశాచిక ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరంలోని సెయింట్ జేవియర్ బాయ్స్ కాన్వెంట్ అటాచ్డ్ హాస్టల్లో గుడివాకలంక ప్రాంతానికి చెందిన సుధీర్ ఏడో తరగతి చదువు తున్నాడు. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన విజయ్ కూడా ఇదే పాఠశాలలో ఏడవ తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో విజయ్ తల్లి విదేశాలకు వెళ్లి రావడంతో గత కొద్ది రోజుల క్రితం విజయ్ ఇంటికి వెళ్లి తల్లిని చూసి 4 రోజుల క్రితం ఏలూరులోని హాస్టల్ కు తిరిగి వచ్చాడు. పథకం ప్రకారం ఇంటి నుండి హాస్టల్ కి వచ్చే ముందు తనతో పాటు ఒక బాటిల్లో పెట్రోల్ నింపుకొని తీసుకువచ్చాడు. తాను ఎలాగైనా తిరిగి ఇంటికి వెళ్లి పోవాలనే ఉద్దేశంతో ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున నాలుగున్నర ఐదు గంటల ప్రాంతంలో పెట్రోల్ బాటిల్ లో ఉన్న పెట్రోల్ ను ఇదే హాస్టల్లో ఉంటున్న గుడివాకలంక గ్రామానికి చెందిన సుధీర్‌పై పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో ఆ బాలుడికి శరీరంలో ఎడమ వైపు వీపు, ఛాతి భాగం, తొడ భాగంలో తీవ్రమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న సుధీర్‌ను తోటి విద్యార్థులు గమనించి మంటలను అదుపు చేసి హాస్టల్ వార్డెన్ కిషోర్ సహాయంతో క్యాథలిక్ సంస్థకు చెందిన ఐపిఎం హాస్టల్ కి చికిత్స నిమిత్తం హుటాహుటిన తరలించారు. అనంతరం ఈ విషయాన్ని మరుగు పరిచేందుకు గాయాల పాలైన బాలుడి తల్లిదండ్రులకు హాస్టల్ వార్డెన్ కిషోర్ ఫోన్ చేసి మీ కుమారుడు మీపై బెంగ పెట్టుకున్నారని, అతన్ని చూసేందుకు రావాలని చెప్పడంతో సుధీర్ తల్లిదండ్రులు హుటాహుటిన ఏలూరులో ఉన్న జేవియర్ హాస్టల్ కు చేరుకున్నారు. అనంతరం హాస్టల్ వార్డెన్ కిషోర్ వారిరువురిని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాలుడు వద్దకు తీసుకు వెళ్లడంతో తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు. త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వరకు ఈ విషయాన్ని మరుగుపరిచి రాజీ చేసేందుకు పాఠశాల యాజమాన్యం విశ్వప్రయ త్నాలు చేసి విఫలమైంది. దీంతో బాలుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయాల పాలైన బాలుడు విషయం దావానంలా వ్యాపించ డంతో ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంసంగా మారింది. ఎన్నడూ లేని విధంగా మైనర్ బాలుడు సహచర విద్యార్థిపై అత్యంత క్రూరత్వం ప్రదర్శించి పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన ఇటు పోలీసులను అటు ప్రజాప్రతినిధులను నివ్వెరపోయేలా చేసింది. విషయం తెలుసుకున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు సుధీర్‌ను పరామర్శించి కుటుంబీకులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భవిష్యత్తులో జేవియర్ హాస్టల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. హాస్టల్ నిర్వహణపై ఇంత అశ్రద్ధ వహించిన పాఠశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సాధార ణంగా ఇంటికి వెళ్లి హాస్టల్ కి తిరిగి వచ్చిన విద్యార్థులు తమ వెంట ఏమేమి తెచ్చుకున్నారనేవి పరిశీలించి లోనికి అనుమతించాల్సిన హాస్టల్ వార్డెన్ కిషోర్ నిర్లక్ష్యం వల్లే ఇటువంటి సంఘటన చోటు చేసుకున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలు ఏ హాస్టల్లో జరగకుండా ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యనమదుర్రు ముంపునకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర -భీమవరం: యనమదుర్రు డ్రైన్ ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం కూటమి ప్రభుత్వంలో కచ్చితంగా జరుగుతుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త గాదిరాజు సుబ్బరాజు అన్నారు. మెంటేవారితోటలోని ముంపు బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక, టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బ రాజు మాట్లాడుతూ గత ఐదు రోజులుగా ముంపు బాధితులకు దాతలందిస్తున్న సహకారం అద్వితీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎస్ కే టి సి అధినేత గాదిరాజు సుబ్బరాజు సౌజన్యంతో ముంపు బాధితులకు ఆహార పొట్లాలను అందించామని, బాధితులు ఇంకా ఇబ్బందులలనే ఉన్నారని దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, మెంటే గోపి, లోవ రాజు, రాంబాబు, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ఆర్.డి.ఎస్‌కు నాక్ బృందం

విశాలాంధ్ర -భీమవరం: ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం గురువారం సందర్శించి అన్ని విభాగాల్లో గత ఐదేళ్ల పనితీరును మదింపు చేసింది. బరోడాకు చెందిన మహారాజు షాయాజీరావు యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రజ్ఞేష్ షా నేతృత్వంలో కర్ణాటక తాంకుర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.కోట్రేష్, కేరళ సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జార్జి వి.థామస్ లు అన్ని అంశాలను పరిశీలించారు. అధ్యాప కులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థు లతో నాక్ బృందం విడి విడిగా సమావేశం నిర్వహించి పలు అంశాలను నివృత్తి చేసుకున్నారు. తొలుత కళాశాలకు విచ్చేసిన నాక్ బృందానికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీ కాంతం, ఐక్యూఏసి ఇన్చార్జి డాక్టర్ పి.అరవిదస్వామి తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సంతాపం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరసా సత్తిరాజు ఆకస్మికంగా మృతి చెందడంతో కార్యాలయంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, పంచాయతీ విస్తరణ అధికారి రత్న కుమార్, వెలుగు, ఉపాధి,గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దాతలు ఇచ్చే రక్తమే బాధితులకు శ్రీరామరక్ష

విశాలాంధ్ర-తణుకు: దాతలు ఇచ్చే రక్తమే బాధితులకు శ్రీరామరక్ష అని స్థానిక బుద్దాల బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ బుద్దాల నరసింహమూర్తి(నాని) అన్నారు. బుద్దాల వాలంటరీ బ్లడ్ బ్యాంక్ 15వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో వార్షికోత్సవ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన సజ్జాపురం గ్రామానికి చెందిన బొల్లాడ నాగరాజును సత్కరించి షీల్డ్ బహుకరించారు. సకాలంలో రక్తం అందుబాటులో లేక ఏటా వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఇలాంటి క్లిష్ట సమయాలలో దాతలు ఇచ్చే రక్తమే బాధితులకు శ్రీరామరక్ష అని బుద్దాల నర్సింహమూర్తి అన్నారు. ఇప్పటివరకు 51 సార్లు ప్లేటిడ్స్, రక్తదానం చేసిన నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్త దాత బొల్లాడ నాగరాజు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నానని బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుచేసిన ప్రముఖ సినీ కథానాయకుడు చిరంజీవి స్ఫూర్తితో రక్తదానం చేయడం ప్రారంభించానన్నారు. పట్టణ ప్రముఖులు, తోటి మిత్రులు తదితరులు నాగరాజును అభినందించారు.

దాసు మృతి సీపీఐకి తీరని లోటు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : ఇటీవల అనారోగ్యంతో మరణించిన బుట్టాయిగూడెం సీపీఐ సీనియర్ నాయకులు పాముల పాపాదాసు కుటుంబ సభ్యులను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జె. రమణరాజు గురువారం బుట్టాయిగూడెంలో పరామర్శిం చారు. ఈ సందర్భంగా పాపాదాసుతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఏజెన్సీ ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాల్లో పాపాదాసు సేవలందించారని ఆయన తెలిపారు. ఎర్ర జెండా భుజాన్ని వేసుకుని ప్రజల పక్షాన పోరాటం చేసిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు చిలంతరాజుల శ్రీను,సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. ఫ్రాన్సిస్ ఉన్నారు.

దాసు మృతికి సంతాపం

విశాలాంధ్ర-కామవరపుకోట: ఏజెన్సీ ప్రాంత ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించి ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులను ఐక్యపరిచి వారిలో చైతన్యం కలిగించి గిరిజన, గిరిజనేతరులకు మధ్య ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంలో తనదైన ప్రత్యేక శైలితో గిరిజనులకు భూమి దక్కించడంలో క్రియాశీల పాత్ర పోషించిన సీపీఐ బుట్టాయిగూడెంకు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పాముల పాపా దాస్ మృతికి సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, సహాయ కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి. సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన మృతికి సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, మేనుగుల దుర్గారావు, ఏమండ్ర స్వామి, టి.రాములమ్మ, కరేటి నరసింహులు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

బడ్జెట్లో వ్యవసాయ కార్మికుల ఊసేలేదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, ఆరుకాలం శ్రమించే కష్టజీవులైన వ్యవసాయ కార్మికుల ఊసే లేదని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు విమర్శించారు. గురువారం జంగారెడ్డిగూడెం సీపీఐ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు కనీస వేతన బిల్లుపై, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులు మంజూరుపై బడ్జెట్లో లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి కేంద్రం తన వంతు కృషి చేసిందన్నారు. రాజధానికి రూ.15 వేల కోట్లను నేరుగా గ్రాంటుగా ప్రకటించకుండా , ప్రపంచ బ్యాంకు వంటి వాటి నుండి అప్పుగా, ఇస్తామని , దానికి తాము ష్యూరిటి ఇస్తామని చెబితే దానికి రాష్ట్ర ప్రభుత్వం మనకు ఏదో మేలు జరిగినట్లు గొప్పలు చెప్పుకోవడం దారుణం అన్నారు. విలీన మండలాల్లో వరదలు భీభత్సం సృష్టించి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బ తీసాయని,ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి మండలం యూనిట్గా భూసేకరణ,ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు,శ్రీను, నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి: కౌలు రైతులు రెవెన్యూ అధికారుల నుండి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని వ్యవసాయశాఖ ఏడిఏ జి.వెంకటమణి రైతులకు సూచించారు. మండలంలో ఊటుకూరు , వణుదుర్రు, వాడవల్లిలో వ్యవసాయశాఖ అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా పొందే వివిద పథకాలకు పంటనమోదు, సబ్సిడీపై యంత్రపరికరాలు, బ్యాంక్ రుణాలు పొందేందుకు, ధాన్యం కొనుగోలు, పంటనష్టం తదితర వాటికి సబ్సిడీ పొందేందుకు కౌలు రైతులు అర్హత పొందేందుకు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలం వ్యవసాయశాఖ అధికారి బి.వేణు మాధవ్, విఏఏలు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర-వేలేరుపాడు: భద్రాచలం వద్దపెరుగుతున్న గోదావరి నది రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని తద్వారా అధికారులు అప్రమ త్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వేలేరుపాడు మండలం కరుటూరు గ్రామంలోని ప్రజలను కలిసి గోదావరి నది ప్రమాద హెచ్చరికపై అప్రమత్తంగా ఉండాలని జేసీ చెప్పారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేలేరుపాడు తహశీల్దారు కార్యాలయంలో వరదలు ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు.ఈ సమావేశంలో లోతట్టు గ్రామాల ప్రజలు తక్షణమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్డిఓ కె. అద్దయ్య, జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, సివిల్ సప్లైయిస్ జిల్లా మేనేజరు మంజుభార్గవి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.ఎస్.ఎస్. రాజు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కుక్కల స్వైరవిహారం

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - భీమవరం టౌన్: జిల్లాలో ఏ ప్రాంతం చూసినా వీధికుక్కల బెడద చాలా తీవ్రంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో, కుక్కలు గుంపులుగా చేరి ఒంటరిగా వెళుతున్న మనుషుల మీద తీవ్రంగా దాడి చేస్తున్నాయి. చిన్నపిల్లల మీద కుక్కల దాడి చేయ టం, సర్వసాధారణం అయిపోయింది. కుక్క కరిసిన వ్యక్తిని ప్రభుత్వ హాస్పటల్‌కు ప్రాథమిక చికిత్స చేయించేందుకు తీసుకు వెళ్తూ ఉంటారు. అటువంటి ప్రభుత్వ హాస్పిటల్‌లోనే కుక్కలు స్వైరవిహారం చేస్తుంటే ప్రథమ చికిత్స కోసం వచ్చే రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. భీమవరంలోని ఏరియా హాస్పి టల్‌లో చిన్నపిల్లల వార్డులో వీధి కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో తమ చిన్నారులకు ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచికొస్తుందో నని చిన్నారుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ హాస్పిటల్‌లో కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

అదనపు వర్జీనియా పొగాకు అమ్మకానికి అనుమతి

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: అదనంగా పండించిన పొగాకును అమ్ముకోవటానికి రైతులకు, అధీకృత వేలం ఫ్లాట్ ఫారాలపై కొనుగోలు చేయటానికి వ్యాపారస్థులకు అనుమతినిస్తూ కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ సునిల్ బర్త్వాల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.ఇది రైతుల విజయం అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ సునిల్ బర్త్వాల్ కి రైతుల తరపున కృతజ్ఞతలు తెలియజేసారు. పొగాకు రైతుల సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి ఈ నెల 3వ తేదీన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తీసుకెళ్ళారు. రైతులకు మేలు చేసే జీవోను విడుదల కావడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేసారు.

శానిటేషన్ పనులు వేగవంతంగా చేయించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రామాలలో శానిటేషన్ పనులను వేగవంతం చేయాలని డి.ఎల్.పి.ఓ సుందరి ఆదేశించారు.. లింగపాలెం మండలం లోని ధర్మాజీగూడెం, లింగపాలెం, యడవల్లిలో ఆమె పర్యటించారు. వర్షాల వల్ల లింగపాలెం మండలంలో ఏర్పడిన పారిశుధ్యపు సమస్యను విశాలాంధ్ర వెలుగు తీయడంతో స్పందించిన ఈమె గురువారం పర్యటించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మురికినీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త చెదారాన్ని తీసి వేయించాలని సూచించారు. వర్షాలు పడటం వల్ల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈమెతోపాటు మండల పంచాయతీ విస్తరణాధికారి రత్నకుమార్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలు పేద విద్యార్థులకు వరం

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: ట్రిపుల్ ఐటీలు పేద విద్యార్థులకు ఒక వరమని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో గురువారం నూజివీడు పోలీస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజం మీద అవగాహన కలిగి ఉండాలన్నారు.విద్యార్థుల చదువుతో సంపాదించుకున్న జ్ఞానం రాష్ట్రానికి తద్వారా దేశానికి ఉపయోగపడాలన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్, అప్లికేషన్ డెవలప్మెంట్, వెబ్సైట్ డెవలప్మెంట్, ప్రోడక్ట్ డెవలప్మెంట్ మీద ఆసక్తి కనబరిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు సంపాదించుకోగలుగుతారన్నారు. విద్యార్థులు పోలీస్ డిపార్ట్మెంట్‌తో కలిసి సామాజిక దురాచారాలను నిర్మూలించేందుకు సహాయ పడాలన్నారు. అనంతరం ఆర్జీయూకేటీ నూజివీడు నిర్దేశకులు ఆచార్య ఎం. చంద్రశేఖర్, ఎస్పీని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్పి జి.లక్ష్మయ్య, నూజివీడు డివిజన్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు ఆర్జీయూకేటీ నూజివీడు డీన్ అకాడమిక్స్ రత్నాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : విద్యతోపాటు బాలికలు యుక్త వయస్సులో తీసుకోవలసిన జాగ్రత్తలు, బాల్య వివాహ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. శ్రీదేవి అన్నారు. గురువారం జగన్నాథపురం గ్రామంలో మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు అవగామన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని 10వ తరగతి అనంతరం బాలికలకు బాల్య వివాహాలు చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారని అది చట్టరీత్యా నేరం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్స్ ఎ. తులసీరాణి, కె.గీత, టి.రామలక్ష్మి, వి. అంజికుమారి, ఎం.శాంతకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఉప్పాకపాడు విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉప్పాకపాడులో శిక్షా సప్తాహ్ లో భాగంగా నాల్గో రోజు గురువారం సాంస్కృతిక పోటీలు ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఉపాధ్యాయులు అల్లు శ్రీను ప్రోత్సాహంతో విద్యార్థులు గాంధీజీ, నెహ్రూ, అంబేద్కర్,

డాక్టర్, జాలరి, రైతు, టీచర్, భారతమాత, తెలుగుతల్లి, సోదెమ్మ వేషాధరణలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు .గాంధీజీ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని తల్లిదండ్రులు అన్నారు. వీరికి సోమవారం జరుగు సహపంక్తి భోజనాల సమయంలో ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని ఉపాధ్యాయులు పి. శ్రీదేవి తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులను తయారు చేసిన తలిదండ్రులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, మాకా రత్నకుమారి, షేక్ ఉన్నీషా, మిరియాల లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

3ఎఫ్ సహకారంతో ఇంగ్లీషు లాంగ్వేజ్ ప్రారంభం

విశాలాంధ్ర - పెంటపాడు: స్థానిక డి ఆర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రిపుల్ ఎఫ్ కంపెనీ డైరెక్టర్ సీమా గోయింకా సహకారంతో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్ ని ప్రారంభించారు. ఈ లాంగ్వేజ్ ల్యాబ్‌లో విద్యార్థులకు అవసరమైన పది కంప్యూటర్లను 3ఎఫ్ కంపెనీ నుండి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా

డైరెక్టర్ సీమా గోయింకా మాట్లాడుతూ ఈనాటి ప్రపంచంలో ఆంగ్ల భాష ఎంతో ప్రాముఖ్యత ఉన్న సంగతి విద్యార్థులు గుర్తించి,ఆంగ్ల భాషపై పట్టు సంపాదించు కుంటే ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆమె సందేశం ఇచ్చారు.కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలకి తమ కంపెనీ ఎప్పుడు వెన్నుదన్నుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు,వైస్ ప్రిన్సిపల్ టిఎస్ఎన్.ప్రసాద్,ఆంగ్ల అధ్యాపకురాలు ఎం.ఇందిరమ్మ, ఎన్ సి సి ఆఫీసర్ విక్టర్ ప్రేమ్ సాగర్,తెలుగు విభాగ అధిపతి డాక్టర్ సుంకర గోపాల్,ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వాణి, మిగిలిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

37రోజుకు చేరిన అన్న క్యాంటీన్

విశాలాంధ్ర - కైకలూరు : కైకలూరు నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి కైకలూరు శాసనసభ్యులు మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలు మేరకు డొక్కా సీతమ్మ స్ఫూర్తితో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 37 రోజుకు చేరింది.

గురువారం అన్నదాతగా ప్రముఖ సినీ హీరో నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా భుజబలపట్నం గ్రామానికి చెందిన గుంటూరు మురళీమోహన్ (చిన్నబాబు) కుమారుడు శివ ఆర్థిక సహాయంతో సుమారు 400 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కొల్లి వరప్రసాద్ (బాబీ), తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పులా రాజితులసి, పూర్ణ పుప్పాల సూర్యప్రకాష్,అద్దంకి రమేష్ రాజు, నాని రామాయణం, కొండలరావు,నారా రోహిత్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో అధిక నిధులు కేటాయింపు పట్ల హర్షం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో భారీ కేటాయింపుల పట్ల ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకట రమణ హర్షం వ్యక్తం చేసారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి 15 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి ప్రత్యేక ప్రాజెక్టులు, రాజధాని అమరావతి అభివృద్ధి కి, పోలవరం నిర్మాణానికి హామీ, విశాఖ-చెన్నై

కారిడార్ లో వివిధ అభివృద్ధి పనులకు ప్రత్యేక సాయం, పారిశ్రామిక కేంద్రాలుగా కొప్పర్తి, ఓర్వకల్లు ల అభివృద్ధి, నీరు, రైల్వే, విద్యుత్, రోడ్లు ప్రాజెక్టులకు దశలవారీగా నిధుల కేటాయింపులు సాధిస్తున్నామంటే ఇది కూటమి ప్రభుత్వం వలనే సాధ్యమయిందని వెంకటరమణ ఆమె నివాసం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వా నికి సాధ్యమని అన్నారు.

ఏజెన్సీ మెట్ట ప్రాంత రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : ఏజెన్సీ మెట్ట ప్రాంతాలలో పండించే పామాయిల్ ,వర్జీనియా పొగాకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరికి గతంలో రాజ మండ్రిలో వినతి పత్రం అందజేసి నట్లు మాజీ జెడ్పీటీసి, ఉభయ

పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ తెలిపారు. గురువారం జీలుగుమిల్లిలో ఆయన నివాసం వద్ద మాట్లాడుతూ పామాయిల్‌కు గిట్టుబాటు ధర కల్పించాలని ,ప్రస్తుతం వర్జీనియ పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నట్లు ఆమెకు వివరించామని తెలిపారు. వర్జీనియా పొగాకు ధరలు ఇలాగే ఉండేటట్లు చూడాలని కోరామని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ప్రతి రైతుకు సబ్సిడీపై ఇచ్చి రైతుల అభివృద్ధికి తోడ్పడాలని ఆమెను కోరినట్లు తెలిపారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు ఎంపీ ని కలిసిన వారిలో పోలవరం ,చింతలపూడి, గోపాలపురం ఎమ్మెల్యేలు సిరి బాలరాజు, సొంగ రోషన్ కుమార్, మద్దిపాటి వెంకట్ రాజు ఉన్నారని తెలిపారు. రానున్న రోజులలో రైతు నాయకులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ను కూడా కలవనున్నట్లు ఆయన తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ రద్దు హర్షణీయం

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ చట్టం-2022ను రద్దు చేస్తూ శాసనసభ తీర్మానించడంపై హర్షం ప్రకటిస్తున్నామని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై న్యాయవాదులు శ్రీవిజ్ఞానవేదిక, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

హర్షం ప్రకటించారు. న్యూటన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకుని వచ్చి ప్రజలకు తీరని నష్టం వాటిల్లిందని, న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి ఆందోళనలు నిరసనలు చేపట్టామని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే యాక్ట్ ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఈనెల 24న అసెంబ్లీలో తీర్మానం చేసి ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, బార్ అసోసియేషన్ కార్యదర్శి అడపా ప్రసన్న కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జె.సత్తిబాబు, లైబ్రరియన్ సెక్రటరి కె.నాగరాజు, ట్రెజరర్ సిహెచ్ పరాలరావు, సభ్యులు బండారు శ్యామల, జి. క్రాంతి కుమార్, ఆర్.సుబ్బయ్య, పులపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని వ్యవసాయ అధికారి బి.సుమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కౌలు రైతులు గుర్తింపు కార్డులతో ప్రభుత్వం ద్వారా అందించే పలు పథకాలు పంటల భీమా పొందవచ్చును అన్నారు. మండలంలో 3,495 మంది కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాల్సి ఉండగా నేటి వరకు 1,500 మంది గుర్తింపు కార్డులు పొందారని ఆమె తెలిపారు. మిగిలిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి అన్నారు. ఎంపిక చేయబడిన రైతులు పొలాల్లో మట్టి నమూనాల సేకరణకు సహకరించాలని ఆమె కోరారు. మండలంలో 810 మట్టి నమూనాల సేకరణకు గాను సుమారు 600 మట్టి నమూనాలు సేకరించినట్లు ఆమె తెలిపారు.

ఆదాయ పన్ను ప్రక్రియలో ఏఐ పాత్ర కీలకం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలోని ఛాంబర్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురువారం పాలకొల్లు ఆదాయ పన్ను శాఖ విభాగం వారి ఐటీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఆదాయ పన్ను ప్రక్రియపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ఐటి ఆఫీసర్ ఆర్. శ్రీరామచంద్రమూర్తి, ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల అధ్యక్షులు కె.వి.ఆర్ నరసింహారావు కళాశాల కార్యదర్శి కె.రామరాజు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ప్రముఖ ఆడిటర్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ ప్రత్యేక అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సంద

ర్భంగా ఐటీ ఆఫీసర్ ఆర్. శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఆదాయ పన్ను అనేది నిర్బంధంగా, స్వచ్ఛందంగా, నైతిక బాధ్యతగా ప్రభుత్వానికి చెల్లించే రుసుముగా ప్రజలు భావించాలన్నారు. తద్వారా దేశ సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించా లని కోరారు. ఆదాయ పన్ను అనేది వాణిజ్య పరమైన అంశం కాదని, ప్రత్యక్షంగా నేరుగా ప్రభుత్వానికి చెల్లించే రుసుముగా భావించాల న్నారు. ఆదాయ పన్ను అంచనా వేయటంలోనూ, ఎగవేత దారులను గుర్తించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారని ఏ.ఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహకారంతో అటువంటి వారిని గుర్తించడం జరుగుతుం దన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించిన వారితో ఆదాయపు పన్ను చెల్లించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో ఐటి ఆఫీస్ పాలకొల్లు ఇన్స్పెక్టర్ శిరీష, చాంబర్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హోల్గా, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని స్థానిక 12వ డివిజన్ గడియార స్తంభం మేడబడి వద్ద ఉన్న

దాకోజు ప్రసాద్ జ్యూయలరీ షాపు వద్ద శ్రీ షిరిడి సాయిబాబా వారి పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరపాలకసంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో దాతృత్వం కలిగిన వ్యక్తి దాకోజు ప్రసాద్ అన్నారు. అయ్యప్పస్వామిపై ఉన్న భక్తితో గత 40 సంవత్సరాలుగా మకర సంక్రాంతి రోజు శబరిమలలో ప్రతి సంవత్సరం ప్రసాద్ సారధ్యంలో అన్నదాన కార్యక్రమం. జరుగుతుందన్నారు. శ్రీషిరిడి సాయిబాబా బాబా వారిపై ఉన్న భక్తితో గురుపౌర్ణమి పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో 12 వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు,కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, బత్తిన విజయ్ కుమార్, దేవరకొండ శ్రీనివాసరావు, ఈదుపల్లి పవన్,నున్న కిషోర్,ఇనపనూరు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కోళ్ల

విశాలాంధ్ర -భీమవరం: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆయన ఛాంబర్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోళ్ల నాగేశ్వరరావు జిల్లాలోని పరిస్థితులను లోకేష్‌కు వివరించారు. అనంతరం ఆయన మంత్రులు అచ్చం నాయుడు,

పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావులను కలిశారు.

నీట మునిగిన చేలను పరిశీలించిన కూటమి నాయకులు

విశాలాంధ్ర -పోడూరు : భారీ వర్షాలకు, గోదావరి వరద ప్రభావానికి నక్కల డ్రైన్ పొంగి ప్రవహి స్తుండటంతో ముంపునకు గురైన వద్దిపర్రు గ్రామాన్ని నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు గురువారం సందర్శిం చారు. ముంపునకు గురైన చేలను,

ప్రధాన రహదారిని వారు పరిశీలించారు. రహదారి పై ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు వారు సూచించారు సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్ తహసిల్దార్ మురళీకృష్ణ ఆర్ ఐ రాంబాబు ఎంపీటీసీ విప్పర్తి శారద గ్రామ టిడిపి నాయకులు శీలం శ్రీనివాసు తిరుమాని దుర్గ ప్రసాద్ జనసేన నాయకులు రాజేష్, వెంకట్, చందు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి నానిని పరామర్శించిన జర్నలిస్టులు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: భీమవరం సాక్షి రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాని, తండ్రి బొక్క సత్యనారాయణ బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వేంద్ర డెల్టా పేపర్ మిల్‌ఉద్యోగిగా, ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా పోరాటాలలో ముఖ్య పాత్ర పోషించారు. నానిని పలువురు ప్రముఖులతో పాటు పలు పత్రికా విలేకరులు,కేతా సత్యనారాయణ, అంతపురం నాని, నుకెళ్ళ తాతారావు, కడలి సాయిబాబా, ఆరేటి శ్రీను ,మూర్తి,గూడూరి నాగరాజు, చినబాబు,నవీన్ తదితరులు పరామర్శించారు.

వాహన చోదకులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: రహదారి భద్రత ప్రమాణాలను వాహనదారులందరూ పాటించాలని తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపారు. ఏలూరు జంగారెడ్డిగూడెం రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద మోటార్ సైకిళ్ల, ఆటోలు, కారులను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారు లందరూ హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్ బాలురు, డ్రైవింగ్ లైసెన్స్ లేని

వారు వాహనాలను నడపకూడదన్నారు. వాహనాలను పరిమిత వేగంతో నడపాలని, లేదంటే ప్రమాదాలు కొని తెచ్చుకోవటమే అన్నారు. వాహనాలను తరచూ పరిశీలన చేస్తామని తగిన పత్రాలు, లైసెన్స్ లేనట్లయితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. వాహనాల తనిఖీలలో ఎస్సై తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈమిషన్ శక్తి " 100 రోజులుపై అవగాహన

విశాలాంధ్ర- పాలకోడేరు : ఈ మిషన్ శక్తి "100 రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం విస్సాకోడేరు అంగన్వాడి సెంటర్ నందు మహిళలకు మరియు

హైస్కూల్ విద్యార్థులకు సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలకు మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్స్ చట్టం గురించి, మరియు బాలికల, మహిళలను అనవస రంగా, అసభ్యకరంగా తాకడం గురించి, లైంగిక వేధింపుల గురించి, స్త్రీల హెల్ప్ లైన్ గురించి ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ల మొదలగు వాటిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు,, స్కూల్ టీచర్స్,అంగన్వాడి టీచర్స్ తాయారు , పద్మ, సూర్యకుమారి, సంగీత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సుపాస్‌ల అందజేత

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని దీనికి తోడు ఆర్టీసీ బస్సు పాసులు వినియోగించుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్టిసి డిపో మేనేజర్ వై ఎస్ ఎన్ మూర్తి అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర హైస్కూల్లో ఉచిత బస్సు పాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్లో 200 మంది విద్యార్థి విద్యార్థులకు దాత తాడేపల్లిగూడెం డిపో ఆర్టీసీ ఉద్యోగి కొవ్వూరి చినరామిరెడ్డి వారి భార్య నాగ సత్యవతి జ్ఞాపకార్థం బస్సు పాసులకు ఆర్థిక సహాయం చేశారు. హై స్కూల్ హెచ్ఎం పెనుమర్తి జయ వెంకటేశ్వర్లు, మానవతా సంస్థ డైరెక్టర్ పాతపాటి హరి కుమార్ రాజు, ఆర్టీసీ పిఆర్ఓ దొంతల విజయ్ కుమార్ పాల్గొన్నారు. దాత రామిరెడ్డిని ఆర్టీసీ వారు సన్మానించారు.

ఆక్రమణలకు బాధ్యులైన అధికారులపై చర్యలు

విశాలాంధ్ర - పాలకొల్లు: వేలాది ఎకరాలకు సాగునీరు అందించే కెసి కెనాల్‌కు సంబంధించి పాలసాగర్ ఉప కాలువ ఆక్రమణలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం శాసనసభా సమావేశాల్లో సభ్యులు అడిగిన

ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలను చేశారు. ఆక్రమణకు సంబంధించి రెవిన్యూ నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు సైతం జరిగాయన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్, జలవనరుల శాఖల్లో తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. తాడేపల్లిలో ఇరిగేషన్ స్థలంలో ఈ.ఎన్.సి, టౌన్ ప్లాన్ అనుమతి లేకుండా జగన్ పార్టీ ఆఫీసు నిర్మాణం జరిపే ప్రయత్నం చేశారనే విషయాన్ని మంత్రి రామానాయుడు ప్రస్తావించారు. అక్రమాలను ప్రోత్సహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

టిడిఆర్ బాండ్ల ప్రధాన సూత్రదారి పై ఏసీబీ విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో అర్బన్ డెవలప్మెంట్ కొరకు ఒక సదుద్దేశంతో గతంలో టిడిఆర్ బాండ్ల ను నాడు చంద్రబాబు ప్రవేశపెట్టారని కానీ 2019 నుండి 24 వరకు వైసిపి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున 3300 టిడిఆర్ బాండ్ల మంజూరు వెనక ఉన్నటువంటి ఆలోచన చూస్తే విశాఖపట్నం నుండి చిత్తూరు వరకు రాష్ట్రమంతా టిడిఆర్ బాండ్లపై భారీ కుంబకోణం జరిగిందని తణుకు శాసన

సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలలో క్వశ్చన్ అవర్ లో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో కొత్త కొత్త దోపిడీలు ఎలా చెయ్యాలి, 60 రోజుల్లో అక్రమార్జన ఎలా చెయ్యాలి, దొరక్కుండా స్కాంలు ఎలా చేయాలి లాంటి పుస్తకాలు కూడా పబ్లిష్ చేయొచ్చని ఎద్దేవా చేశారు. అత్యధికంగా తణుకు మున్సిపాలిటీలో 61 టిడిఆర్ బాండ్లు మంజూరు చేసి 1,48,439 స్కెర్ మీటర్స్ కు 36 ఎకరాలు సేకరించారని, దానికి సంబంధించి 5,93,759 గజాల బాండ్లు ఇచ్చి 146 ఎకరాల ఈక్వలేంట్‌గా ఇచ్చారని దీని విలువ వేల కోట్లలో ఉంటుందన్నారు. తణుకుకు సంబంధించి 2014 నుండి 19 వరకు కేవలం 6 వేల గజాలకు మాత్రమే టిడిఆర్ బాండ్లు ఇస్తే 2019 నుండి 2024 వరకు వైసీపీ కేవలం సంవత్సర కాలంలో 1,48,439 గజాలకు బాండ్లు ఇచ్చారని అందులో 1: 2 శాతం ఇవ్వాల్సిన చోట 1:4 వ్యాలు ఇచ్చారని డోర్ నెంబర్లు మార్చి, అగ్రిమెంట్ల మీద ఉన్న వాటికి కూడా టిడిఆర్ బాండ్లు ఇచ్చి రకరకాల విధంగా దోపిడీ చేసారని అన్నారు. దీనిపై అసలు సూత్రదారులను కాకుండా దళిత వర్గానికి చెందిన కమీషనర్ ను, టౌన్ ప్లానింగ్ అధికారులను బలి చేసారని, దీనిపై మాజీ మంత్రి కారుమూరి పాత్రపై ఏసిబి ఎంక్వయిరీ చెయ్యాలని డిమాండ్ చేశారు.టిడిఆర్ బాండ్ల స్కాం పై ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్లబోతుందో తెలపాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. మండలంలో గవరవరం గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు గురువారం కూటమి పార్టీల నాయకుల చేతుల మీదుగా విద్య సామాగ్రిని అంద జేశారు. ఈ సందర్భంగా

నాయకులు మాట్లాడుతూ చిన్ననాటి నుండి విద్యను అభ్యసించడం ద్వారా తమ జీవితంలో బంగారు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు ఎస్ఆర్ఆర్.నరసింహారాజు, చుక్కల శోభన్ బాబు, యాగంటి హరిబాబు, ప్రేమ్ కుమార్,ప్రధానోపాధ్యాయులు, ఎం. వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : 33 / 11 కే.వీ కొయ్యలగూడెం సబ్ - స్టేషన్ పరిధిలో ఉన్న కొయ్యలగూడెం,గవరవరం, చొప్పరమన్నగూడెం, అంకలగూడెం, రెపల్లేవాడ గ్రామాలలో శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు కరెంట్ నిలుపుదల చేయడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్ మరమ్మత్తులు చేయడం జరుగుతుందని, గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఏలూరు నగరపాలక సంస్థలో దోమల నివారణ

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 28వ డివిజన్‌లోని ద్వారకా నగర్, బీడీ కాలనీ, వాణి నగర్, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లోఉన్న నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్టు మున్సిపల్ హెల్త్ ఆఫీసరు మాలతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల సురేష్, మలేరియా ఇన్స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్వైజర్ డి. దుర్గారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ సోమేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

విశాలాంధ్ర-ఏలూరు : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ శనివారం స్థానిక శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలో బాలలకు అందిస్తున్న

సౌకర్యాలు పైన, పరిసరాల శుభ్రత, పిల్లల భద్రత, వైద్య సదుపాయాల పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి తగు సూచనలు చేశారు.బాలురు తమకు విద్యాబోధనకు సరైన ఉపాధ్యాయుల సౌకర్యం లేదని ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులను ప్రశ్నించగా ఉపాధ్యాయుల సౌక ర్యాల్ని కల్పించవలసిందిగా జిల్లా విద్యాశాఖ అధికారికి, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.దీనిపైన సంబంధిత అధికారులకు సంప్రదించి తక్షణం ఉపాధ్యాయుల సౌకర్యాన్ని విద్యార్థులకు కల్పించి విద్యా సంవత్సరం వృధా కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి. శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర -లింగపాలెం : శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే మండ లంలోని ప్రతి పాఠశాలలో గురు వారం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ధర్మాజీగూడెం ప్రాథమిక పాఠశాలలో జరిగే కార్యక్రమాలను మండల విద్యాశాఖ అధికారి కంట రామారావు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేకమైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం నియోజక వర్గానికి రూ.22 కోట్లు పంచాయతీ నిధులు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : పోలవరం నియోజకవర్గం అభివృద్ధికి పంచాయితీ నిధులు 22 కోట్లు మంజూరు చేయడం జరిగిందని పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య ను మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గానికి నిధులు అడగడం జరిగిందని ఎమ్మెల్యే

తెలిపారు. అడిగిన వెంటనే 22 కోట్లు పంచాయితీ నిధులు మంజూరు చేయటం జరిగిందని అన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు చిర్రి బాలరాజు చేసిన సేవలను కృష్ణ చైతన్య అభినందించారని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మాత్యులు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి నియోజకవర్గం తరపున చిర్రి బాలరాజు అభినందనలు తెలిపారు.

మన ఆరోగ్యం, మన చేతుల్లోనే

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో జనజీవనం స్తంభించి నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. అప్రమత్తమైన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నగర ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మన

ఆరోగ్యం, మన చేతుల్లోనే అనే నినాదంతో వీధి వీధిన ప్రచార రథంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజు ప్రతి వ్యక్తి కాచి చల్లార్చిన గోరువెచ్చ నీటిని తాగాలని, మీరు నివసిస్తున్న పరిసర ప్రాంతాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటుతో డెంగీ వ్యాధికి గురికాకుండా వీలైనంతవరకు నిద్రించే సమయంలో దోమతెరలు కట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలతో ఉన్న బాలింత మహిళలు తగు జాగ్రత్తలు వహించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

అనుశ్రీకి అభినందనలు

విశాలాంధ్ర -ఏలూరు: జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం 'ప్రేరణ"కు ఎంపికైన ఏలూరుకు చెందిన కుమారి అనుశ్రీని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. భారతదేశ వ్యాప్తంగా 10 జిల్లాల నుండి 20 మందిని ఎంపిక చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఏలూరు జిల్లాకు చెందిన అనుశ్రీ ఎంపిక కావటం ఏలూరు జిల్లా ప్రజలకు గర్వకారణమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరు ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రత్యేకంగా ఆధార్ సేవలను గ్రామ సచివాల యాల్లో ఏర్పాటు చేశామని, మండలంలో ఉన్న ప్రజలందరూ ఈ ఆధార్ సేవలను వినియోగించుకోవా లని నిడమర్రు ఎంపీడీవో జి.శివరామకృష్ణయ్య

అన్నారు. గురువారం నిడమర్రు సచివా లయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ను సేవలను ఎలా వినియోగిస్తారు అని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపర్నెంట్ వి. కృష్ణచంద్రరావు, నిడమర్రు గ్రామపంచాయతీ కార్యదర్శి నరసింహస్వామి, ఎండిఓ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచా యతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మూర్తి రాజు మృతి

విశాలాంధ్ర - ఉంగుటూరు: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఉంగుటూరు గ్రామ టీడీపీ అధ్య క్షులు, చల్లాలమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మన్ వడ్లపూడి మూర్తి రాజు మృతి చెందారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారని టీడీపీ నాయకులు గురువారం తెలిపారు.

ఆది నుంచి టీడీపీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేసిన మూర్తి రాజు మరణం అందరిని కలచివేసింది.

పలువురు సంతాపం : టిడిపి నేత మూర్తి రాజు మృతి చెందడంతో పలువురు ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో స్టేజీల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : మండలంలోని తామరాడ హైస్కూలోను, ఎంపిపి పాఠశాలలోను స్టేజీలను నిర్మించేందుకు జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, తామరాడ మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ పాఠశాలలో తన సొంత ఖర్చులతో స్టేజీల ఏర్పాటుకు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా గ్రామ స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సరైన స్టేజీలు లేక విద్యార్థిని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారు ఇబ్బందులు తొలగించేందుకు రెండు స్కూల్స్ లోనూ స్టేజీల ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తామరాడ ఎంపీటీసీ సభ్యులు గోకాడ రాజా, పంచాది నానాజీ, గంధం కృష్ణ, సారా ప్రకాష్ రావు, ఉల్లి సురేష్, జి సత్తిబాబు, పలికెల పల్లా రావు, వై వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల కోరిక తీరింది ఎంపీ పురంధేశ్వరి



విశాలాంధ్ర - సీతానగరం: పొగాకు రైతుల చిరకాల కోరిక తీరిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పురంధేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ ఏటిగట్టు ఉర్లు పేరు చెప్పగానే దేశానికి, రాష్ట్రానికి గుర్తు వచ్చే పంట పొగకు. అలాంటి పొగాకు పంటపై జరిమానా మాఫీ చేయడం ద్వారా పొగాకు రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించినందుకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. అలాగే 1975లోని సెక్షన్ 30 లోని సబ్-సెక్షన్ (1) ద్వారా అందించిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దీని ద్వారా సబ్-సెక్షన్ (1)లోని నిబంధనలను సడలించినట్లు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ డిప్యూటీ సెక్రటరీ మౌనిక గౌర్ ఉత్తర్వుల్లో జారీ చేశారు అని అన్నారు. 2023-24 పంట సీజన్‌లో వేలం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 14గా లోని సెక్షన్ 10 సబ్-సెక్షన్ (1)తో నమోదిత సాగుదారుల అదనపు ఫ్లూక్యూర్డ్ వర్జీనియా పొగాకు పంట విక్రయించడానికి అనుమతిస్తుందని తెలిపారు. పొగాకు రైతుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులకు చలన పరికరాలు

విశాలాంధ్ర - కరప : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు, దివ్యాంగులకు, వయోవృద్ధులకు అవసరమైన పరికరాలు అందించేందుకు జిల్లాలో గల ఆయా నియోజకవర్గాల పరిధిలో ఏఎల్ఐఎంసిఓ సంస్థ ద్వారా శిబిరాలు ఏర్పాటు చేయుట జరుగుతుందని ఎంపీడీవో కె అప్పారావు తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆగస్టు 8వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన శిబిరంలో దివ్యాంగులను పరీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. పరికరాలు కావలసిన దివ్యాంగులు తమ ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలుపరన్నారు. దివ్యాంగులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆయా నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్నందున దూరాన్ని బట్టి అందుబాటులో ఉన్న ఏ నియోజకవర్గంలోనైనా శిబిరాలకు వెళ్ళవచ్చని ఆయన తెలిపారు. కరప, పెదపూడి, కాకినాడ రూరల్ నియోజకవర్గం దివ్యాంగులకు కాకినాడ రూరల్ మండలంలో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

ఆదిత్యలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (2024-2025) ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశానికి ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా ఎన్ సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జెఎన్‌టియుకే ఇంచార్జ్ ఉప కులపతి డా కెవిఎస్ జి మురళి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డా డోలా సంజయ్, కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్, టెక్నికల్ హబ్ సిఈఓ బాబ్జి నీలం పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం ముఖ్య ఉద్దేశం మీ చిన్నారుల బంగారు భవిష్యత్‌కు మీరు కన్న కలల సాకారానికి ఆదిత్య పై ఉంచిన గురుతర బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తించుటకు మీరు , మేము అనుసరించాల్సిన విధి విధానాలను గురించి ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. డా సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నాను అని తెలుపుతూ విద్యార్థిగా ప్రతి ఒక్కరు నిర్దిష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని విద్యార్థుల లక్ష్య సాధనకు ఆదిత్య పరిపూర్ణమైన సహకారం అందిస్తుందని తెలిపారు. ఆదిత్యలో చేరిన ప్రతీ ఒక్కరికి మీ లక్ష్యం మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం అయితే బిటెక్ పట్టాతో పాటు మంచి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగ నియామక పత్రం అందిస్తాం. లేదా మీ లక్ష్యం అత్యున్నత యూనివర్సిటీలో ఉన్నత చదువు అందుకు తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నిర్ణయం మీది అది చేరుకునే మార్గం చూపే బాధ్యత మాది. అయితే అందుకు ఈ నాలుగు సంవత్సరాలు మాతో మీరు (విద్యార్థులు) నడవాలి. అందుకు తల్లిదండ్రులు వారి పూర్తి సహకారం అందివ్వాలి అప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలం అని డా సతీష్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ప్రభుత్వ పాఠశాలలో మరింత బలోపేతం చేస్తే పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించచ్చని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి పివిఎస్ గణేష్ రావు అన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌కి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల విద్యారంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా నూతన ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. జీవో 117 రద్దుచేసి జీవో ఎంఎస్ నెంబర్ 53 2020 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రీ ప్రైమరీతో బాటు 1 నుండి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలగా నడపాలని, విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గీతాల రాజు, జనరల్ సెక్రెటరీ ఏ తేజేశ్వరరావు, సహధ్యక్షులు పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సేవా సమితి అధ్యక్షులు ఉలవశెట్టి శ్రీను అధ్వర్యంలో దివ్యాంగులు గురువారం పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రిరెడ్డి శ్రీను మర్యాదపూర్వకంగా కలిశారు. దివ్యాంగుల సమస్యలు, బ్యాక్‌లగ్ పోస్టుల , దొంగ దివ్యాంగుల సర్టిఫికెట్లు గురించి వెరిఫికేషన్ చేయించి అర్హులైన దివ్యాంగులకి న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, స్వయం ఉపాధి పొందుటకు రుణాలు మంజూరుకు నిబంధనలు సడలింపు చేయాలని కోరారు. దివ్యాంగుల సమస్యలను డిప్యూటీ సీఎం, పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకె ళ్లాలంటూ వినతి పత్రాన్ని పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి శ్రీనివాస్‌కు అందజేశారు.

రంపచోడవరం జిల్లాకు కారం తమ్మన్నదొర పేరు పెట్టాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: బ్రిటీషువారితో పోరాడిన తొలి గిరిజన వీరుడు కారం తమ్మన్నదొర 145వ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం రంపచోడవరం జిల్లాగా ఏర్పాటు చేసి కారం తమ్మన్న దొర జిల్లాగా పేరు పెట్టాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేసారు. 1839 నుండి బ్రిటిష వారికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాటం చేసిన రంపచోడవరం మండలం బందపల్లి గ్రామానికి చెందిన తొలి గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్నదొర చరిత్రను వెలుగులోకి తెచ్చి భారతదేశ ప్రజలకు అందించిన ఎన్డీఏ ప్రభుత్వానికి ఆదివాసీ మహాసభ కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో కారం తమ్మన్న దొర 145వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల్కైన సందర్భంగా జరిగిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కారం తమ్మన్నదొర చరిత్ర వెలుగులోకి వచ్చిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రప్రదేశ్ నుండి తొలి గిరిజన వీరునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా ఈయన చరిత్ర వెలుగులోకి వచ్చినప్పటికీ ఆంధ్రప్రదేశ్లోని గత ప్రభుత్వం ఈ రాష్ట్రంలో తమ్మన్నదొరకు తగిన గుర్తింపు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈ మేరకు తగిన చర్యలు తీసుకొని తొలి గిరిజన వీరునికి తగిన గౌరవం ఇవ్వాలని ఆదివాసీ మహాసభ డిమాండ్ చేస్తుందన్నారు. 1840లోనే కారం తమ్మన్నదొర బ్రిటిషువారిపై తిరుగుబాటు లేవదీసి గెరిల్లా పోరాటం ద్వారా రంప వద్ద క్యాంప్‌లో వున్న 12 మంది సైనికులను బాణాలతో హతమార్చి తెల్లదొరలకు సవాల్ విసిరారన్నారు. మల్కాజ్ గిరి వద్ద కారం తమ్మన్నదొర తల నరికి 1880 జూల్కై 25న కార్బొలిక్ ఆయిల్లో వుంచి తెల్లదొరలు రాజమండ్రి కోటగుమ్మం వద్ద ప్రదర్శనకు ఉంచారన్నారు. ప్రజలు ఈయన బందపల్లికి చెందిన కారం తమ్మన్నదొరగా విశ్వసించార న్నారు. ఎన్నికల సమయంలో నారా చంద్రబాబునాయుడు జగ్గంపేటలో జరిగిన సభలో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసారు. అతని కుటుంబ సభ్యులకు న్యాయం చేయడంలోను, ఆపోరాట యోధునికి తగిన గౌరవాన్ని ఇవ్వడంలోనూ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగానే వ్యవహరించాయని, ఇప్పటికైనా కారం తమ్మన్నదొరకు తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహాసభ ప్రతినిధులు అరగంటి వీరభద్రారెడ్డి, గిడుతూరి చిన్నారావు, కెచ్చెల అబ్బాయి రెడ్డి, కారం శ్రీనివాసు దొర, జక్కల పాండవులు, కారం చిన్నపోతురాజు, మడి అప్పన్న దొర, కారం చిట్టెమ్మ, కారం బుల్లియ్యమ్మ, కారం సంకురమ్మ, కారం వీరాయమ్మ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో జేసీ పర్యటన

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని లంకల గన్నవరంలో గోదావరి వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి ముంపు బాధితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని స్థానిక అధికారులు అన్ని విధాలుగా సహాయక చర్యలు చేపడతారని తెలిపారు. అదే విధంగా మండలంలోని జి పెదపూడి లంక నుండి గోదావరి గట్టు వరకు ట్రాక్టర్ పై నుంచి వరద ప్రభావాన్ని పరిశీలించారు. సందర్భంగా అక్కడి ప్రజలకు అందిస్తున్న గోదావరి వరద సహాయక చర్యలు గురించి స్థానిక అధికారులను ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సత్యనారాయణ, కేశవర్ధన్ రెడ్డి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఎన్డీఏ కూటమి నాయకులు యూనిఫార్మ్, బుక్స్ అందజేశారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు దేవు వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి, మండల జడ్పిటిసి సభ్యులు భోగిరెడ్డి కొండబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగి రెడ్డి గంగాధర్, యాల వీర వెంకట సత్యనారాయణ, పేపకాయల పవన్ కుమార్ తదితరులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని వెంకన్న తెలిపారు. పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం ఏ విధంగా అమలు జరుగుతున్నది పరిశీలించి పిల్లలకు రుచికరమైన పదార్థాలు పెట్టాలని వేడిగా ఉన్నప్పుడే భోజనాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ చైర్మన్ మంచాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి

విశాలాంధ్ర - పెరవలి : మండలంలోని కాపవరం మల్లేశ్వరం గ్రామంలలో గురువారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలలో భాగంగా కాపవరం పాఠశాల ఉపాధ్యాయురాలు గౌరి మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, బాలల హక్కులు తెలుసుకుని పిల్లలను పెంచడంలో తల్లి ప్రముఖ పాత్ర పోషించాలని ఖచ్చితంగా ప్రతి ఆడపిల్లను చదివించాలని అలా జరిగినప్పుడే భావితరాల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. సిడిపిఓ శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. మహిళా సాధికారత బాల్యవాహల వలన వచ్చే ఇబ్బందులను వివరించారు. ఈసందర్భంగా వైద్య శాఖ సిబ్బంది సుచరిత సంధ్య పిల్లల ఆరోగ్యం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ ఆశ్విని మాట్లాడుతూ చిన్నతనం నుండి బాల బాలికలకు మంచి చెడు విషయాలపై అవగాహన కల్పించాలని అన్నారు. మల్లేశ్వం గ్రామంలో ఈవిషయాలపై ర్యాలీ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు బాలసరస్వతి సిహెచ్‌లక్ష్మి అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ గట్లు మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర - గోపాలపురం : కాలువ గట్లు బలహీనంగా ఉన్నచోట్ల శాశ్వత ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ తెలిపారు. గురువారం మండలంలోని గంగోలు రాజంపాలెం గ్రామాల మధ్యగల పోలవరం ప్రధాన కుడి కాలువకు అనుసంధానంగా ఉన్న తాడిపూడి కాలువ వంతెన వద్ద బలహీనమైన గట్లకు ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. గత నాలుగు రోజుల క్రితం కొద్దిపాటి నీరు ఆ మరమ్మతుల ప్రాంతం నుంచి రావడంతో ఇసుక బస్తాలు వేసి నీటిని నిలుపుదల అరికట్టారు. నేడు ఆ ప్రాంతాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ తాడిపూడి కాలువ ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతూ మరమ్మత్తుల పనులు వేగవంతం చేసి చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం గా వ్యవహరించకుండా కాలువ గట్లను పటిష్ఠ పరచాలని తెలిపారు. ఈయన వెంట తహసిల్దార్ కే. వనజాక్షి, కొవ్వాడ ప్రాజెక్ట్ ఏఈ, డిటి సాకే కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఎన్ఐఇఎల్ఐటి ఏర్పాటుకు వినతి

సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రధాన్

విశాలాంధ్ర - కాకినాడ : పార్లమెంటు సమావేశాల్లో భాగంగా ఢిల్లీ పర్యటనలో ఉన్న కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కాకినాడ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి, కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటుపై చర్చించారు. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజవర్గంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎన్ఐఇఎల్ ఐటి)ని ఏర్పాటు చేయాలని కోరామని, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం వెంటనే అందించాలి

విశాలాంధ్ర-చాగల్లు: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం చాగల్లులోని పాటేమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం మండల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కదారి ప్రభాకర రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులు నష్టాల్లో, అప్పుల్లో ఉన్నారని చెప్పారు. భూ యజమాని అంగీ కారంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు అందించాలని కోరారు. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు ప్రకారం ఎటువంటి హామీ లేకుండా ప్రతి కౌలు రైతుకు రూ. 1,50,000 వరకు హామీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం రూ. 20వేలు ప్రతి కౌలు రైతుకు అందించాలని డిమాండ్ చేశారు. 2019 పంట సాగు దారుహక్కు చట్టాన్ని రద్దుచేసి 2011 భూ అధికృత సాగుదారు చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీ నర్ గారపాటి వెంకట సుబ్బారావు, మండల అధ్యక్షులు కంకటాల బుద్ధుడు, సిఐటియూ నాయకులు దుర్గారావు, కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వాల నమోదు విజయవంతం

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని రెండవ వార్డు లోని వినాయకుడి గుడి వద్ద నిర్వహించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత సమోదు మహా యజ్ఞం కార్యక్రమం విజయవంతంగా జనసేన పార్టీ కొవ్వూరు టౌన్ అధ్యక్షులు దేగల రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వం చూసి ప్రజలందరూ క్రియాశీలక సభ్యత్వం చేయించుకోవాలని ముందుకు వస్తున్నారని అన్నారు. కొవ్వూరు పట్టణంలోని యువత అత్యధిక సంఖ్యలో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కొవ్వూరు టౌన్ నాయకులు పోలిశెట్టి శివ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తిరుమల గణపతి, తెలుగు దేశం పార్టీ నాయకులు మహమ్మద్ బహదూర్,వంగా సురేష్, జనసేన పార్టీ కొవ్వూరు టౌన్ వీరవనిత దేగల నిఖిత, దాసరి వెంకటేశ్వరరావు ,జనసేన పార్టీ జనసైనికులు పాల్గొన్నారు.

మహిళను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట శెట్టిబలిజ పేటకు చెందిన వానశెట్టి సింహాచలంకి జీవిత జైలు శిక్షను పెద్దాపురం అడిషనల్‌సెక్షన్ జడ్జి విధించినట్లు జగ్గంపేట ఇన్చార్జి ఎస్సై బలరాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2013 ఏప్రిల్‌లో సింహాచలం తన భార్య పై అనుమానం పెంచుకుని అదే కాలనికి చెందిన బత్తిన భవానీ దానికి కారణం అనుకుని ఆ వివాహితను కల్లు గీసే కత్తితో నరికి హత్య చేశాడు. దీనిపై అప్పటి గండేపల్లి ఇన్చార్జి ఎస్సై కేసు నమోదు చేయగా సిఐ భరత్ మాతాజీ దర్యాప్తు చేశారు. దీనిపై గురువారం పెద్దాపురం జడ్జి ముద్దాయికి యావత్ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు బలరాం తెలిపారు.

సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో చమురు సహజ వాయుల సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో గ్రామాల అభివృద్ధికి ఇతోదికంగా ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఓఎన్‌జిసి అధికారులను కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు చమురు సహజ వాయువులు సంస్థ తూర్పు ప్రాంత ఆఫ్ సోర్ ఎసెట్ కాకినాడ ప్రతినిధులు జిల్లా పంచాయతీ అధికారి సిపిఓలతో సమావేశం నిర్వహించి ఓడల రేవు తదితర ప్రాంతాలలో మూడు క్లస్టర్ల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఓఎన్జిసి ప్రతినిధులు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఓఎన్జిసి అధికారులు ముడి చమురు, గ్యాస్, నీటి విభజన విధానం పైప్ లైన్ భద్రత గోదావరి బేసిన్లో చమురు సహజ వాయువులు డ్రిల్లింగ్ ద్వారా వెలికితీత, డ్రిల్లింగ్ సమయంలో ఆ ప్రాంతంలో చేపల వేట కోల్పోయిన మత్స్యకారులకు జీవనభృతి అందించడం, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కేటాయింపు, తదితర అంశాలను విశదీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు విధి విధానాల పరంగా విడుదల చేస్తూ నిక్షేపాలు వినియోగించుకుంటున్న చమురు సంస్థలు ఈ ప్రాంత అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు చమురు, సహజవాయుల సంస్థ (ఓఎన్జిసి) వారి కార్యకలాపాలపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పంచాయితీ అధికారి, ఓఎన్జిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కార్పోరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులు కేటాయింపు అంశాలపై క్షుణ్ణంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఓఎన్జిసి చమురు నిక్షేపాలు వెలికి తీస్తున్న గ్రామాల జాబితాను సిద్ధం చేసి గ్రామాభివృద్ధికి స్థానిక ప్రజల డిమాండ్ అంశాలను సమర్పించాలని జిల్లా పంచాయితీ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చమురు సహజ వాయుల సంస్థ ఎస్టేట్ మేనేజరు కార్యనిర్వాహక సంచాలకులు రత్నెస్ కుమార్, సీజీఎం మెకానికల్ నిర్మల్ కుమార్, హెడ్‌హెచ్ఎస్‌సి మేనేజర్ భాస్కరరావు, హెచ్ఆర్‌హెడ్ సునీల్ కుమార్, ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ ఏ గుప్తా, ప్రొడక్షన్ సూపరిం టెండెంట్ ఇంజనీర్ మురుగవెల్, సీనియర్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటీవ్ సాదా భస్వర్, ఫణీంద్ర సరేంద్ర, సిపిఓ వెంకటేశ్వర్లు జిల్లా పంచాయతీ అధికారి డి రాంబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్, వారి ఉత్తర్వులు మేరకు, కాకినాడ డాక్టర్ హనుమంతరావు పర్యవేక్షణలో కాకినాడ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ , కాకినాడ ఆర్టీవో డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 25వ తేదీన, కాకినాడ డిగ్రీ కాలేజీ లో విద్యార్థులకు ట్రాఫిక్ -1 ఇన్స్పెక్టర్ రమేష్, ట్రాఫిక్ 2 ఇన్స్పెక్టర్ చైతన్య కృష్ణ వారి సిబ్బంది, కాకినాడ మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ పానెల్ అడ్వకేట్ డాక్టర్ సునీల్ కాంత్ కుమార్, కాకినాడ ఆర్టీవో మురళీకృష్ణ, కాకినాడ డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసం పద్మావతి, సంయుక్తంగా నిర్వహించిన రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా, రోడ్ యాక్సిడెంట్లను నిర్మూలించాలనే ఉద్దేశంతో వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం , త్రాగి మితిమీరిన వేగంతో నడపడం వల్ల కలిగే నష్టాలను, ద్విచక్ర వాహనాలకు అమర్చబడిన మోడిఫైడ్ సైలెన్సర్ల వల్ల వచ్చు శబ్ద కాలుష్యం వల్ల ప్రజలకు కలుగు ఇబ్బందులను గురించి, టూ వీలర్స్ పై ఇద్దరి కన్నా ఎక్కువమంది ప్రయాణించరాదనే విషయాల గురించి వారికీ తెలియపరచి వారిలో చైతన్యం తీసుకురావాలనే ఈ కార్యక్రమం నిర్వహించారు.

అరాచకాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - పెదపూడి : గత ప్రభుత్వం హయాంలో అనపర్తి నియోజకవర్గంలో జరిగిన శాంతి భద్రతల సమస్యలు, పోలీస్ అరాచకాలపై చర్యలు తీసుకోవాలని డీజీపీ ద్వారక తిరుమల రావును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డీజీపీని కలిసి గతంలో నియోజకవర్గంలో అరాచకాలు జరిగాయంటూ పలు విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ మీడియా ఇన్చార్జ్, గుంటూరు జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఉన్నారు.

డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - యానాం : యానాం నియోజకవర్గంలో యానాం మున్సిపాలిటీ , ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయేరియా నిర్మూలనపై వివిధ పాఠశాలల్లో ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల పైన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర నాయక్, వెల్ఫేర్ ఆఫీసర్ రొయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు రైతులకు చేయూతనివ్వాలి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా, మురారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాట్రావులపల్లి బ్రాంచ్లను మండలం వ్యవసాయ అధికారి, సద్గురుమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా బ్రాంచ్ మేనేజర్‌లకు కౌలుదారులు వివరాలు అందించి ప్రభుత్వ ఆదేశాల మేరకు విరివిగా పంట రుణాలు అందించి వారి తోడ్పాటుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్, గ్రామ ఉద్యాన సహాయకులు ఉదయ్, సాయికిరణ్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి సబ్ స్టేషన్, పీరా రామచంద్రపురం 33 కెవి లైన్ పరిధిలో నేడు (శుక్రవారం) చెట్టుకొమ్మలు తొలగించడం,మరమ్మతులు నిమిత్తం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివే యనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. విద్యుత్ సరఫరా జిబిఆర్ కళాశాల ఏరియా, ఇందిరానగర్ సునందన పేట,శేషగిరిరావుపేట, వెంకట రత్నపురం, మెయిన్ రోడ్, కెనాల్ రోడ్, ద్వారపూడి రోడ్డు, కాకినాడ రోడ్డు, కొప్ప వరం, మహేంద్రవాడ, లక్ష్మీ నరసాపురం,పీరా రామచంద్రపురం, దుప్పలపూడిలో నిలిపివేయనున్నట్లు శ్రీధర్ వర్మ చెప్పారు. ఇండస్ట్రియల్ లైన్లు, వ్యవసాయ లైన్లు కూడా నిలిపివేస్తామని దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

పెరవలి : మండలంలోని కొన్ని గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యుటీవ్ ఇంజనీర్ బి వీరబద్రరావు ప్రకటన ద్వారా తెలిపారు. మల్లేశ్వరం ఫీడెర్ విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలను తొలగింపు నిమిత్తం నల్లకుల వారి పాలెం , మల్లేశ్వరం అన్నవరపుపాడు, పిట్టల వేమవరం ఖండవల్లి గ్రామములకు ఉద యం 7 గంటలనుండి మధ్యాహ్నం11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈగ్రామములకు వ్యవసాయ విద్యుత్ సమయాలు ఉదయం 4 గంటల నుండి 7 వరకు మధ్యాహ్నం11 గంటల నుండి సాయంత్రం 4 గంటలవరకు మార్చడ మైనది విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆలయ అభివృద్ధికి కృషి..



విశాలాంధ్ర - కొవ్వూరు : పట్టణంలో ప్రతిష్టాత్మకమైన మెరక వీధి విఘ్నేశ్వర ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా దేగల రామ కృష్ణ ఎన్నికయ్యారు. వీధి విఘ్నేశ్వర ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. ఆలయ అభివృద్ధి , రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు నూతన అధ్యక్షుడు దేగల రామకృష్ణ పేర్కొన్నారు స్థానిక ఆలయం వద్ద గురువారం నూతన కమిటీ ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షులు దేగల రాము, గంగు మల్ల స్వామి, పోలిశెట్టి శివ, ఉపాధ్య క్షులు శేషగిరిరావు కార్యదర్శి దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

హరీష్ పోరాటానికి హర్షధ్వానాలు



విశాలాంధ్ర - అమలాపురం : జరిగిన ఎన్నికల్లో కోనసీమలో మూడున్నర లక్షల అత్యధిక మెజారిటీతో హరీష్ ఎంపీగా గెలిచారు. ఈయన పార్ల మెంట్లో సంచలన విషయాలను చర్చకు తెస్తూ కాకలు తీరిన అధికార, ప్రతిపక్షాలకు చెందిన యోధాను యోధులు కొలువు తీరిన పార్లమెంట్లో కోనసీమ జిల్లాకు తన తండ్రి దివం గత లోక్ సభాపతి జీఎంసి బాలయోగి జీవిత ఆశయమైన కోటిపల్లి-నర్సా పురం రైల్వే లైన్ పూర్తి చేయడంపై పార్లమెంట్లో గళాన్ని వినిపించారు. మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కోనసీమ అభివృద్ధి కోసం కన్న కలలను సాకారం చేయాలనే సంకల్పంతో, ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంఎంత ముఖ్యమో పార్ల మెంట్ సాక్షిగా నినదించారు. ఈ రైల్వే లైన్ అటు పర్యాటక రంగాన్ని విస్తరిం చడంతోపాటు పుణ్యక్షేత్రాలైన ద్రాక్షారామం, అయినవిల్లి, అంతర్వేది దేవాల యాల దర్శనం సులభతరం చేస్తే పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్య లో వచ్చి, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలో పేతం అవుతుందని, కొబ్బరికాయ ప్రాసె సింగ్ పరిశ్రమకు నూతన మార్కెట్లు అందుబాటులోకి వస్తాయని, జలవ్యవ సాయంలో మత్స్యకారులకు మరింత మార్కెట్ అవకాశాలు లభించి, న్యాయ మైన ధరలు అందుకోవడం సాధ్యమవుతుందని హరీష్ వివరించారు. ప్రత్యే కంగా, కోటిపల్లి-నర్సా పురం రైల్వేలైన్ పనులు పూర్తిచేయ దంలో ఆంధ్రప్రదేశ్ రీజర్వేషన్ యాక్ట్‌లోని షెడ్యూల్ 13 ప్రకారం కేంద్రం మరింత నిధులు కేటాయించి ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని హరీష్ బాలయోగి ప్రభుత్వాన్ని కోరారు.